నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కే పురం, ఫిబ్రవరి 23: రాక్ టౌన్, గణేష్‌పురి, సాయి నగర్, డెంటల్ కళాశాల 11 కెవి ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్‌శాఖ డిఈ కే.కే.రామకృష్ణ తెలిపారు. రాక్ టౌన్ ఫీడర్ పరిధిలో రాక్‌టౌన్, లలితనగర్, అయ్యప్పకాలనీ పరిసర ప్రాంతాలు. గణేష్‌పురి ఫీడర్ పరిధిలో రామాలయం, ఇంద్రానగర్, గణేష్‌పురి, న్యూ దిల్సుఖ్‌నగర్, ద్వారకాపురం పరిసర ప్రాంతాలు. సాయి నగర్ ఫ్రీడమ్ పరిధిలో కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ, సాయినగర్, లలితనగర్ పరిసర ప్రాంతాలు. డెంటల్ కళాశాల ఫీడర్ పరిధిలో హుడా కాలనీ ప్రధాన రహదారి, మోర్ వెనుక ప్రాంతం, డీసీబీ బ్యాంక్, డెంటల్ కళాశాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బాలిక కంట్లో కారం చల్లి దాడి

ఒకరి రిమాండ్

బడంగ్‌పేట్, ఫిబ్రవరి 23: ఓ మైనర్ బాలిక కంట్లో కారం చల్లి ఓ వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. శనివారం మహబూబ్‌నగర్‌కు చెందిన గణేశ్ అనే వ్యక్తి లెనిన్‌నగర్‌కు చెందిన పన్నాల సురేశ్ ఇద్దరు ఒకేచోట పని చేస్తారని తెలిపారు. వారిద్దరి మధ్య గొడవ జరిగిందన్నారు. సురేశ్ ఇంట్లోలేని సమయంలో గణేశ్ వారి ఇంటికి వచ్చాడు. సురేశ్ లేకపోవడంతో ఇంట్లో మిషన్‌పై ఉన్న కత్తెర తీసుకొని సురేశ్ కూతురు కంట్లో కారం చల్లి కత్తెరతో దాడి చేశాడని సురేశ్ మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముత్యాల బజారన్న, అలియాస్ గణేశుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడిపై దాడి

సైదాబాద్, ఫిబ్రవరి 23: మద్యం మత్తులో పాత కక్షలను దృష్టి పెట్టుకొని యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల, బాధితుల కథనం ప్రకారం.. సైదాబాద్ సింగరేణి కాలనీ ఘణపురం గుడిసెల్లో నివసించే మూడవత్ సురేశ్ నాయక్(22)ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన జగన్ అతని మిత్రుడు హర్షాద్ ఇద్దరూ కలిసి స్థానికంగా నిర్మానుష్య ప్రాంతంలో మద్యం సేవిస్తుండగా, మూడావత్ సురేశ్‌నాయక్ అతని స్నేహితుడు నితిన్‌తో కలిసి అక్కడికి వెళ్లాడు. వారందరూ గొడవ పడుతుండా కుటుంబ సభ్యులు సురేశ్ నాయక్ ఇంటికి రమ్మని చెప్పడంతో, అతను ఇంటికి వెళ్తుండగా ఒక్కసారిగా జగన్ తన వద్ద పెట్టుకున్న కత్తితో సురేశ్ నాయక్ పొట్టపై పొడిచాడు. దీంతో రక్తస్రావం కావడంతో అతని మిత్రుడు నితిన్ వెంటనే కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం సురేశ్‌ను ఉస్మాని ఆస్పత్రికి తరలించారు. తమ కుమారుడిపై దాడికి పాల్పడిన జగన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడి తల్లి దండ్రులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సాయికృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

- క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి
- సమాజాన్ని మార్చడంలో ముందుండాలి

జల్‌పల్లిలో క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

బడంపేట్/పహాడిషరీఫ్, ఫిబ్రవరి 23: మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ వాదే ఉమర్ కాలనీలో బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడారంగంపై దృష్టి సాధించాలని ఆమె సూచించారు. యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. యువత వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి మార్గంలో నడవాలన్నారు. వార్డుస్థాయి నుంచి జాతీయస్థాయి క్రీడా రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. పట్టుదల అనేది ఉంటే తప్పనిసరిగా అనుకున్న గమ్యాన్ని చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో జలపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ అబ్దుల్లా సాధి, మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, శంషుద్దీన్, దస్తగిరి, బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శంషుద్దీన్, హమీద్ అలీ, మన్సూరి, మిరాజ్ భాయ్, మతిన్‌పటేల్, సయ్యద్ జిషన్, మగ్దూం బాయ్, మాహేశ్వరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, జల్ పల్లి సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ అబ్బాస్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షకు హాజరయ్యేలా సీఐ సహకారం

- కందుకూరులోని ఎగ్జామ్స్ సెంటర్‌కు వెళ్లకుండా.. మహేశ్వరం సెంటర్‌కు వెళ్లిన విద్యార్థి..
- హాల్‌టికెట్ పరిశీలించి తన కారులో అసలు ఎగ్జామ్ సెంటర్‌కు పంపించిన సీఐ

పోలీస్ వాహనంలో పరీక్ష కేంద్రానికి రిషికను తీసుకెళ్తున్న పోలీసులు

మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు

బడంగ్‌పేట్, ఫిబ్రవరి 23: మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు మానవత్వం చాటుకున్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మాన్ ఖాల్‌కు చెందిన అక్కన్ గారి రిషిక గురుకులంలో ఐదవ తరగతి ప్రవేశానికి పరీక్ష రాయాల్సి ఉన్నది. ఉదయం 10:30 గంటలకు పరీక్ష కేంద్రం దగ్గర ఉండాలి.. వారికి తెలియక మహేశ్వరం వెళ్లిపోయారు. సోషల్ వెల్ఫేర్ ఎగ్జామ్ కందుకూరు పరిధిలోని కొత్తూరు దగ్గర ఉన్న ఎన్నారై ఇన్‌స్టిట్యూట్లో రాయాల్సి ఉన్నది. కందుకూరు పోవాల్సిన మహిళ తన కూతురు రిషికను తీసుకొని మహేశ్వరం ఎగ్జామ్ సెంటర్‌కు తీసుకొవచ్చారు. చెకింగ్ అధికారులు ఎగ్జామ్ సెంటర్ ఇక్కడ కాదు కందుకూరులో ఉందని చెప్పారు. దీంతో భయాందోళన చెందిన మహిళ ఎలా పోవాలో తెలియక ఆందోళనలో పడ్డారు. సమయం తక్కువగా ఉన్నది. మహేశ్వరం నుంచి నేరుగా ఎగ్జామ్స్ సెంటర్‌కు పోవడానికి ఏమీ లేదు. ఎలా పోవాలని తడబడుతున్నారు. అక్కడే ఉన్న సీఐ పరీక్షా కేంద్రం దగ్గర పరిశీలించడానికి వచ్చారు. మహిళ తన బిడ్డ తడబాటు పడుతున్న విషయాన్ని గమనించిన సీఐ ఏమైందమ్మా అని అడిగాడు. దీంతో ఆ మహిళ 'సార్ మా పాపని ఎగ్జామ్ రాయడానికి తీసుకువచ్చాను. కానీ సెంటర్ ఇక్కడ కాదంటున్నారు. ఎక్కడుందో నాకు తెలియదు. టైం అయిపోతుందంటున్నారు. ఎలాగైనా మా బిడ్డను పరీక్ష రాయించాలనుకుంటున్నాను' సార్ సమాధాన చెప్పింది. సీఐ వెంటనే కానిస్టేబుల్‌ను పిలిపించి తన వాహనం ఇచ్చి వాళ్లను ఎగ్జామ్స్ సెంటర్ దగ్గర వదిలిపెట్టి రావాలని సూచించారు. కానిస్టేబుల్ వారిని పోలీసు వాహనంలో తీసుకెళ్లి వదిలిపెట్టారు. దగ్గరుండి అమ్మాయిని పరీక్ష కేంద్రంలోనికి పంపించి వచ్చారు. సమయానికి పరీక్షా కేంద్రం దగ్గరకు తీసుకువచ్చినందుకు మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లుకు ఆ మహిళ కృతజ్ఞతలు తెలిపారు.

చిన్న చెరువు పరిరక్షణకు చర్యలు

సెంట్రల్ బ్యాంక్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

కార్పొరేటర్ నరసింహారెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 23: చిన్న చెరువును డంపింగ్ యార్డ్‌గా తయారు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని మనసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హెచ్చరించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సెంట్రల్ బ్యాంక్ కాలనీ తోపాటు సమీపంలోని చిన్న చెరువును ఆదివారం కాలనీ వాసులతో కలిసి ఆయన సమస్యలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్న చెరువులో చెత్తాచెదారంతో పాటు ఇతర వ్యర్థాలను వేస్తూ అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారని తెలిపారు. వ్యర్థాలతో చెరువు మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. చెరువును పూడ్చడం వలన భూగర్భ జలాలు అడుగంటి పరిసర కాలనీలో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. చెరువు పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జక్కిడి తిరుమలరెడ్డి, సభ్యులు మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఆనంద్ కుమార్, హరీశ్, కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే అవసరం: మాజీ మేయర్

ఉత్తమ ప్రతిభకనబరిచిన వారికి గ్రేడింగ్ పాయింట్లు ఇస్తున్న మాజీ మేయర్ పారిజాత

బడంగ్‌పేట్, ఫిబ్రవరి 23:మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సిరిపురం యాదయ్య గ్రౌండ్‌లో సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు గ్రేడింగ్ బెల్టులను చిగురింత పారిజాత నరసింహారెడ్డి ఆదివారం అందజేశారు. ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని ఆమె సూచించారు. తనకు తాను రక్షించుకోవడానికి ఈ విద్యలను తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. నాయకులు గట్టు బాలకృష్ణ, మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ జి.నాగరాజు, మాస్టర్స్ జి.శివ, డి. మంజునాథ్, కె. సంగీత, బాలాజి పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి చదువులకు ఆర్థిక సాయం

దూదేకుల షేక్షావలి

ఆర్కే పురం, ఫిబ్రవరి 23: ఆర్కేపురం డివిజన్ చిత్రలేఔట్ కాలనీలో అనాథ విద్యార్థి గృహం విద్యార్థి దూదేకుల షేక్షావలి, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్స్ చదివేందుకు ఆర్థిక చేయూత కోసం ఎదురు చూస్తున్నాడు. గృహం అధ్యక్షులు మార్గం రాజేశ్ తెలిపిన ప్రకారం.. అనంతపురం జిల్లా, హిందూపురం మండలం, ముద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దూదేకుల షేక్షావలికి తండ్రి చనిపోయాడు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో చేరాడు. గృహంలో ఉంటూ ఉప్పల్‌లో ఉన్న లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలలో ఉచితంగా అడ్మిషన్ తీసుకొని ఇంటర్మీడియట్‌లో 85 శాతం మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. అనంతరం ఫిజియోథెరపీ కోర్స్‌కు సంబంధించిన డాక్యుమెంట్లతో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్వహించిన కౌన్సిలింగ్‌లో పాల్గొనగా, మొదటి దశలోనే నెల్లూరులోని నారాయణ ఫిజియోథెరపీ కళాశాలలో సీటు వచ్చింది. ఈ నాలుగున్నర సంవత్సరాల కోర్సు చదువుటకు కాలేజీ ఫీజుకు గాను రూ.1.08 లక్షలు, హాస్టల్, భోజన వసతికి రూ.2.98 లక్షలు, మొత్తం రూ.4.06 లక్షలు అవసరమవుతాయి. సీటు రిజర్వు చేసుకోవడానికి ఈనెల 25 తేదీ లోపు కాలేజీకు రూ.27వేలు చెల్లించాల్సి ఉంది. అంత డబ్బు కట్టలేక దూదేకుల షేక్షావలి దాతల సాయం కోరుతున్నాడు. అందువలన సరస్వతి పుత్రుడైన షేక్షావలి ఉన్నత చదువులకు దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం చేయాలని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షులు మార్గం రాజేశ్ కోరారు. మరిన్ని వివరాలకు 99857 20394 కు సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మచ్చబొల్లారంలో స్థానికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 23 : ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం అరుంధతి దవాఖాన ఆధ్వర్యంలో మచ్చ బొల్లారం మార్కెట్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, జీఆర్‌బీఎస్, ఈసీజీ టెస్టులు ఉచితంగా చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దవాఖాన వ్యవస్థాపకులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి సురేశ్ సేవా సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, పరమేశ్, అతిక్, జావిద్, మహేశ్ ,వినయ్, రాజు, రాజేశ్ ,మధుసూదన్‌రెడ్డి ,శ్రీను, సందీప్‌రెడ్డి, సతీశ్, బషీరుద్దీన్ పాల్గొన్నారు.

హబ్సిగూడ డివిజన్‌లో

రామంతాపూర్,ఫిబ్రవరి 23: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీశ్ పేర్కొన్నారు.ఆదివారం హబ్సిగూడ డివిజన్‌లోని వీధి నంబర్-7వద్ద డాక్టర్ ధీరజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. నాయకులు ఎల్లాచారి, శైలేందర్ ,భాస్కర్ పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌ల సంక్షేమానికి కృషి

బైక్ మెకానిక్, ఆటోమొబైల్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 23:ద్విచక్ర వాహనాల మెకానిక్‌లు, ఆటోమొబైల్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం టు వీలర్ మెకానిక్, ఆటోమొబైల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చింతలకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు తన దృష్టికి తీసుకువచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అసోసియేషన్‌కు నియోజకవర్గంలో కొంత స్థలం కేటాయించాలని తమ దృష్టికి తీసుకువచ్చారని, అవకాశం ఉన్న చోట స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పొల్యూషన్ తగ్గించాల్సిన బాధ్యత కూడా మెకానిక్‌లపై ఉందన్నారు. వాహన కాలుష్యం వలన భవిష్యత్తులో ప్రమాదం ఏర్పడుతుందని, దానిని తగ్గించే శక్తి మెకానిక్ల దగ్గర ఉందన్నారు. ఈ సందర్భంగా కొన్ని రోజుల క్రితం మరణించిన నరేశ్ అనే మెకానిక్ కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్, అసోసియేషన్ సభ్యులు అరవింద్ రెడ్డి, మెయిన్, నరేందర్ రెడ్డి, ప్రసాద్, దామోదర్ గౌడ్, అజయ్, నర్సింహా యాదవ్, షేక్ షరీఫ్, హెచ్.బి.సీ.ఎల్.కంపెనీ సభ్యులు సురేశ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గాడ్గే మహారాజ్ స్వచ్ఛభారత్ స్ఫూర్తికి మూలపురుషుడు



గాడ్గే మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపేందర్ రెడ్డి

ఆర్కే పురం, ఫిబ్రవరి 23: గాడ్గే మహారాజ్ స్వచ్ఛభారత్ స్ఫూర్తి కి మూలపురుషుడని సామాజిక సేవా వేత్త చిలక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ ఆర్ కె పురం చౌరస్తాలో గాడ్గే మహారాజ్150వ జయంతి కార్యక్రమం బీసీ కులాల ఐక్యవేదిక కార్యదర్శి పగడాల ఎల్లన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిలుక ఉపేందర్ రెడ్డి హాజరై గాడ్గే మహరాజ్* చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ పగడాల శ్రీశైలం, యాదవ రెడ్డి, పెద్దపూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, లింగస్వామి గౌడ్, అంజన్ రావు, చిలక రాజు సాయి జగదీష్ బొడ్డుపల్లి నగేశ్, పగిళ్ల అంజి, సాయి, ప్రశాంత్ విప్లవ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్ర సహిత చండి మహా యాగం

రుద్ర సహిత చండి మహాయాగంలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న మొళ్లూరి నవీన్ శర్మ తదితరులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 23: బీఎన్.రెడ్డినగర్ డివిజన్ శ్రీపురం కాలనీలోని రేణుక రాజేశ్వరిపీఠం ఆధ్వర్యంలో రుద్ర సహిత చండీ మహాయాగాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. పీఠాధిపతి మొల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాగానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బి.ఎన్.రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..లోక కల్యాణం కోసం నవీన్‌శర్మ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పద్మా రెడ్డి, చంద్రయ్య, నరసింహారెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు కాంతారావు, సురేందర్ రెడ్డి, జంగయ్య గౌడ్, కిషోర్ కుమార్, సురేష్‌కుమార్, డివిజన్ కార్యవర్గ సభ్యులు భాను, ఎస్సీ మోర్చా సెక్రెటరీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ స్విఫ్ట్ లాజికార్ట్స్ యాజమాన్యం మోసాలతో డీసీఎం యజమానులకు ఇబ్బందులు

బిల్లులను విడుదల చేయాలని ఆటోనగర్‌లోని సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న డీసీఎం యజమానులు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 23: స్మార్ట్ స్విఫ్ట్ లాజిక్ కార్ట్స్ సంస్థ సమయానికి డీసీఎం యాజమాన్యానికి డబ్బులు చెల్లించకుండా మోసాలకు పాల్పడుతుందని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హబీబ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డీసీఎం యజమానులకు పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆటోనగర్‌లోని సంస్థ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్మార్ట్ స్విఫ్ట్ లాజిక్ కార్ట్స్ సంస్థ తమ డీసీఎంలలో అమెజాన్, ఫ్లిప్కార్ట్ సంస్థల సరుకులను రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్నారని, కానీ వారు తమకు సమయానికి డీసీఎం వాహనానికి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. సంస్థ నుంచి డీసీఎం యజమానులకు లక్షల్లో డబ్బులు రావాల్సి ఉందని తెలిపారు. బిల్లుల విషయంపై ప్రశ్నించేందుకు పలు జిల్లాల నుంచి డీసీఎం యజమానులు ఇక్కడికి వస్తే సంస్థ ప్రతినిధులు తప్పించుకొని తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ మోసాలపై ఇప్పటికే కొందరు కరీంనగర్ పోలీస్ స్టేషన్‌తోపాటు వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారని తెలిపారు. డీసీఎం యజమానులను ఇబ్బందులు గురి చేయకుండా వెంటనే వారి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీఎం యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న త్యాగరాజ కృతులు

మినీ శిల్పారామంలో త్యాగరాజ కృతులు ఆలపిస్తున్న కళాకారులు

రామంతాపూర్ ,ఫిబ్రవరి 23: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం వాగ్దేవి సంగీత విద్యాలయం గురువులు తాడేపల్లి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సంగీత కళాకారులు సరితా, పద్మ, హైమావతి, శృతి, జనార్దన్, శ్రీకర్, మౌక్తిక, శ్రీనివాస్, అన్నపూర్ణ, దాక్షాయణి, శృతి, శ్రావ్య, లక్ష్మి, అన్నపూర్ణ, అభిలాష్ ఆలపించిన త్యాగరాజ కృతులు ఆహుతులను ఆకట్టుకున్నాయి. త్యాగరాజ కీర్తనలు తులసి దళములతో, నగుమోము, , పంచరత్న కృతులు ఎందరో మహానుభావులు, జగదానంద కారక, సాధించెనే, దుడుకుగల , కనకన రుచిరా మొదలైన కృతులను ఆలపించారు.

వైస్‌చాన్స్‌లర్‌కు ఎమ్మెల్యే సన్మానం

కాప్రా/మల్లాపూర్: రాయలసీమ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలానగర్‌కాలనీ నివాసి ప్రొఫెసర్ బసవరావు నియమితులయ్యారు.దీంతో ఆదివారం వారి ఇంటికివెళ్లిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బసవ రావును శాలువాతో సన్మానించారు.ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ జే.ప్రభు దాస్, మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, కాలనీసంక్షేమసంఘం ప్రతినిధులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బోడుప్పల్ ప్రభుత్వ పాఠశాల 2001-2002 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ విద్యార్థులు తమ అనుభవాలను ఒకరినొకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల కలయికతో పాఠశాల ఆవణలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిష్టయ్య, సుందరం, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్, ప్రతిభారాణి, శైలజ, రత్న, పూర్వ విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

– బోడుప్పల్, ఫిబ్రవరి 23

భార్యభర్తల మధ్య గొడవ.. భార్య ఆత్మహత్య

ఉప్పల్, ఫిబ్రవరి 23: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధి రామంతపూర్‌లోని కామాక్షిపురంలో ఆకుల మనీషా(24) అనే గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదివారం రామంతపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గౌడ కులానికి చెందిన మనీషా, ముదిరాజ్ కులానికి చెందిన సంపత్‌తో సంవత్సరం క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. ఇద్దరు సూర్యాపేట జిల్లాకు చెందిన వారు కాగా, బతుకుదెరువు కోసం రామంతపూర్‌కు వలస వచ్చి ఉంటున్నారు. సంపత్ నిలోఫర్ దవాఖానలో టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య ఏర్పడ్డ మనస్పర్థల కారణంగా మనీషా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీ తరలించి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తాగునీరు వృథా.. పట్టించుకోని అధికారులు

పోచారం,ఫిబ్రవరి23: పోచారం మున్సిపాలిటీ లక్ష్మీనర్సింహకాలనీలో ప్రతిరోజూ తాగునీటి ట్యాంక్ నుంచి నీరు వృథా పోతుంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో ప్రతిభ వెలికి తీయొచ్చు

వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభిస్తున్న సినీ హీరో సుమన్

ఆర్కే పురం, ఫిబ్రవరి 23: వైజ్ఞానిక ప్రదర్శనతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చు అని దాదాసాహెబ్ ఫాల్కలే అవార్డు గ్రహీత, సినీ హీరో సుమన్ అన్నారు. ఆదివారం నారాయణ పాఠశాలలో అన్వేషణ పేరిట 2025 సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హీరో సుమన్ హాజరై సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్వేషణ-2025కార్యక్రమంలో ప్రదర్శించిన రోబోతో అగ్నిమాపక యంత్రం, సెన్సార్‌ను ఉపయోగించి రోడ్డు ప్రమాదాలను నియంత్రించే యంత్రం, సాటిలైట్ కమ్యూనికేషన్ విధానం, కాలుష్య నివారణ యంత్రం, వ్యవసాయ రంగంలో ఉపయోగపడే ఆధునిక యంత్రాలు, వివిధ వనరులతో విద్యుత్ తయారీ విధానం, మానవ శరీర భాగాలైన గుండె, మెదడు, ఊపిరితిత్తులు, కాలేయం పనిచేయు విధానం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గణితశాస్త్రంలో పజిల్స్, రసాయన శాస్త్రంలో వివిధ వాయువుల తయారీ విధానం అద్భుతంగా ఉన్నాయని విద్యార్థులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి, కోర్ డీన్ వెంకటరెడ్డి, హైదరాబాద్ సీఓ స్కూల్స్ డీన్ మదనాచారి, ఏజీఎం సదాశివుడు, ఆర్ఎం ఓహెడ్ గురునాథం, పాఠశాల ప్రిన్సిపల్స్ నాగరాణి, సురేశ్,అకాడమిక్ డీన్ విష్ణువర్ధన్, ఏవో శశిధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.